క్లుప్తంగా

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



గట్లమల్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించినప్పుడే ఉన్నత స్థానానికి చేరుకుంటారని సర్పంచ్‌ల ఫోరం మండల ఉపాధ్యక్షుడు తిప్పని రమేష్, ఎంపీపీ ఉపాధ్యక్షురాలు కర్ణకంటి రేణుక అన్నారు. గట్లమల్యాల ఉన్నత పాఠశాలలో మంగళవారం దేశ్‌పాండే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్కిల్స్ ఇన్ ఇంగ్లిష్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ్‌పాండే ఫౌండేషన్ క్లస్టర్ ట్రైనర్ లావణ్య మాట్లాడుతూ.. దేశ్‌పాండే సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని ఎంపిక చేసిన పాఠశాలల్లో కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2లక్ష రుణమాఫీతో పాటు సొంతింటి స్థలంలో ఇందిమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. పల్లె పల్లెకూ ప్రవీణ్ అన్న– గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రవీణ్‌రెడ్డి మండలంలోని వరికోలు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నెరవేర్చబోయే హామీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధర్మయ్య, ఎంపీటీసీ నిర్మల, నాయకులు తిరుపతిరెడ్డి, తిరుపతి, బాలకిషన్, సుధాకర్, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్, శివరెడ్డి, మహ్మద్ రఫీ, వెంకట్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు కూరగాయలు అందజేత



గోశాలలో కూరగాయలు అందజేస్తున్న మహిళా విభాగం సభ్యులు

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలోని ఆనంద నిలయంలో గల గోశాలకు 50 కేజీల కూరగాయలు, వృద్ధులకు పండ్లు, బిస్కెట్లను కుకునూరుపల్లి మండల వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మహిళా విభాగం అధ్యక్షురాలు స్రవంతి మాట్లాడుతూ.. ఇతర సమయాల్లో కాకుండా ముఖ్యంగా ఆషాఢమాసం పురస్కరించుకొని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా విభాగం, పురుషుల విభాగం నాయకులు స్రవంతి, రమ్య, గంగిశెట్టి శ్రీనివాస్, కొమురవెల్లి సంతోష్, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న కిరణ్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మద్దెల కనకయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ పరామర్శించి, కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకయ్య, నాయకులు రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గద్దల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మురికి కాల్వ సమస్య పరిష్కరించాలి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి 8వ వార్డులో నెలకొన్న మురికి కాల్వ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ మండల కమిటీ సభ్యుడు కత్తుల భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వినయ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 30 సంవత్సరాల క్రితం 8వ వార్డులో మురికి కాల్వ నిర్మించారని, నీరు నిల్వ ఉండి మురుగు వాసనతో ఇబ్బంది కలుగుతుందని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఈరి భూమయ్య, నాయకులు సిద్దులు, బాలమల్లు, రమేశ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్సుల శిబిరానికి స్పందన

మొదటిరోజు 1823 దరఖాస్తుల స్వీకరణ



డ్రైవింగ్ లైసెన్స్‌లకు దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన యువకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక నియోజకవర్గంలోని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ లైసెన్స్‌లు ఇప్పించేందుకు ముందుకొచ్చారు. లైసెన్స్‌లు లేనివారు దుబ్బాక పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో జూలై 4 నుంచి 13వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దీంతో మంగళవారం మొదటి రోజు 1823 మంది దరఖాస్తులు చేసుకోవడం విశేషం. ఉదయం నుంచే డ్రైవింగ్ లైసెన్స్‌లకు దరఖాస్తులు చేసుకోవడానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావడంతో ఎంపీ కార్యాలయంతో పాటు పరిసర ప్రాంతం జనంతో సందడిగా కనిపించింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద బీఆర్‌ఎస్వీ నాయకులు దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకునే వారు 2 ఫొటోలు, ఆధార్‌కార్డు, టెన్త్ సర్టిఫికెట్ లేదా బర్త్ సర్టిఫికెట్ సమర్పిస్తూ రశీదు తీసుకుంటున్నారు. అర్హులందరికీ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు హెల్మెట్ అందిస్తారు.

సద్వినియోగం చేసుకోండి

ఎంపీ ప్రభాకర్‌రెడ్డి కృషితో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల శిబిరానికి మొదటిరోజు భారీ స్పందన వచ్చిందని ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో దరఖాస్తుల ప్రక్రియను ఆమె పరిశీలించారు. లైసెన్స్‌లు లేనివారు తప్పకుండా దరఖాస్తులు చేసుకొని ఉచితంగా ఎంపీ సహకారంతో లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు.

చదువులో రాణించి సత్తాచాటాలి



విద్యార్థినిని అభినందిస్తున్న వైస్‌ఎంపీపీ, సర్పంచ్

మద్దూరు(హుస్నాబాద్): బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి అనే విద్యార్థినిని వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలతమల్లేశం, సర్పంచ్ సుందరగిరి స్రవంతిపరశురాములు అభినందించి చదువు ఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సుమలత మాట్లాడుతూ.. బాసర ఐటీలో ఎంపిక కావడం అభినందనీయమని ఉన్నత చదువుల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నిమ్మ లకర్ణాకర్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు మంద సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు ఉన్నత పాఠశాల నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 13 మంది విద్యార్థులను శనిగరం భూలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ దేశిరెడ్డి మాట్లాడుతూ.. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కనకయ్య విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారిలో స్ఫూర్తిని నింపాడన్నారు. కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని, 40 మంది విద్యార్థులు ఎంపిక కావడం ఉపాధ్యాయుల పనితీరుకు, విద్యార్థుల పట్టుదలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సిద్దిపేట సాధిద్దాం



ఇంటింటికీ సేకరించిన చెత్త

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సిద్దిపేట ఉద్యమంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని 5 వార్డులో ఇంటింటికీ పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేపట్టి వార్డులో శ్రమదానం నిర్వహించారు. తడి, పొడి, హానికర చెత్త విభజనపై వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వినోద్, విజేయందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబ

కొండపాక(గజ్వేల్): కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ వరగంతం సాయిబాబ పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలోని ఎల్లమ్మ తల్లి ఆలయ ఆవరణలో మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబ మాట్లాడుతూ.. గ్రామాల్లో తిరుగుతూ పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇతర పార్టీల పనితీరులపై వ్యతిరేకంగా ఉన్న వారిని గుర్తించి బీజేపీలో చేరేలా కృషి చేయాలన్నారు. ప్రతీ కార్యకర్త ప్రజా క్షేత్రంలో ఉంటూ పార్టీ పటిష్టతను పెంచాలని కోరారు. తమిళనాడు నుంచి వచ్చిన స్వల్పకాలిక విస్తారక్ దేవరాజ్ పార్టీ సంస్థాగత విషయాలపై దిశానిర్దేశం చేశారు. అనంతరం పార్టీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఉమ్మడి కొండపాక మండల ఉపాధ్యక్షుడిగా రెడ్డమైన లింగం, కార్యదర్శిగా నల్ల మల్లేశం, లీగల్ సెల్ కన్వీనర్‌గా గడీల చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా బొద్దుల శ్రీకాంత్, మంచాల శ్రీనివాస్, కోరే సంతోష్‌లతో పాటు మరి కొందరు ఎన్నికయ్యారు. అనంతరం ఎల్లమ్మ ఆలయం చుట్టూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, భానుచందర్, రామస్వామి, లింగం, ఉపేందర్, ప్రవీణ్, నర్సింహారెడ్డి, కిష్టాగౌడ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో సిబ్బంది

మిరుదొడ్డి(దుబ్బాక): చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని సిద్దిపేట భరోసా కేంద్రం ఇన్‌చార్జి హరిత అన్నారు. మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భరోసా సంస్థ ఆధ్వర్యంలో మహిళలపై జరిగే లైంగిక దాడులు, పోక్సో చట్టం, బాల్య వివాహాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు భరోసా కేంద్రంలో నమోదైన కేసుల్లో చాలా వరకు 15–20 సంవత్సరాల వయస్సు కలవారే ఎక్కువగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. చట్టాలను ఉల్లంఘించి అనైతిక కార్యక్రమాలకు పాల్పడే వారి గురించి సిద్దిపేట భరోసా కేంద్రానికి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి ఏఎస్‌ఐ మధు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, భరోసా టీం సభ్యులు రేణుక, భవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ క్రీడా పాఠశాలలకు విద్యార్థుల ఎంపిక



ఎంపిక పోటీలు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు నిర్వహించిన మండల స్థాయి ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా స్పోర్ట్స్ ఆఫీసర్ జంగపల్లి వెంకటనర్సయ్య మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు నిర్వహించిన ఎంపిక పోటీలకు 56 మంది హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఎత్తు బరువుతో పాటు 30 మీటర్స్ ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 800 మీటర్స్ పరుగు తదితర పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసినట్టుగా తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు ప్రశాంత్, ప్రకాష్‌రెడ్డి, రమ్య, తిరుపతి, శ్రీరాం తదితరులు ఉన్నారు.



ప్రజ్ఞాపూర్ శివారు గురుకులంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న శంకర్

గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

గజ్వేల్‌రూరల్: గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులోగల వర్గల్‌కు చెందిన గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గల్‌కు చెందిన గురుకుల పాఠశాల ప్రజ్ఞాపూర్‌లో, జగదేవ్‌పూర్‌కు చెందిన గురుకులం కొండపాకలో, దుబ్బాకలో సైతం ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. అరకొర సౌకర్యాల మధ్య విద్యాబోధన జరుగుతుందని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా పాఠ్య పుస్తకాలు, దుస్తుల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యారంగాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించాలని, లేనిపక్షంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

టిప్పర్ వాహనంపై డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న దళిత యువకుడిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొడకండ్లలో బాధిత దళిత యువకుడు మనోజ్‌కుమార్‌ను పరామర్శించారు. టిప్పర్ వాహనంపై డ్రైవింగ్‌కు పిలిచి టైరు పంక్చరైందనే సాకుతో వాహనం యజమాని కుటుంబం మనోజ్‌కుమార్‌ను కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి చట్టప్రకారం తక్షణ సాయంతో పాటు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

రెవెన్యూ డివిజన్ జేఏసీ రాంపూర్ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులతో అంజయ్య తదితరులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఉద్యమంలో భాగంగా గ్రామ గ్రామాన జేఏసీ కమిటీలు వేసే క్రమంలో మంగళవారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగోని అంజయ్యగౌడ్, మాజీ సర్పంచ్ రంగు శివశంకర్‌గౌడ్, జేఏసీ నాయకుడు అందె అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో కన్వీనర్‌గా రంగు రాజమౌళి, కో–కన్వీనర్లుగా నిమ్మ లక్ష్మారెడ్డి, బండారి సిద్ధయ్య, బండారి నర్సయ్య, కార్యదర్శిగా మలిపెద్ది రవీందర్, సహాయ కార్యదర్శులుగా నిమ్మ మహేందర్‌రెడ్డి, బండారి మల్లయ్య, రంగు సుభాష్, జేఏసీ ప్రతినిధులుగా మల్లయ్య, హన్మారెడ్డి, రాజు, అంజయ్యలను ఎన్నుకున్నారు.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



గజ్వేల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



నంగునూరు(సిద్దిపేట): సిద్దన్నపేటలో..



చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న నాయకులు



హుస్నాబాద్‌లో..

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని కురుమ యువ చైతన్య సంఘం రాష్ట్ర కార్యదర్శి మీస సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం దొడ్డి కొమురయ్య 77వ వర్ధంతిని పట్టణ కేంద్రంలో నిర్వహించారు. పట్టణంలోని అంగడిబజార్ వద్ద ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో కురుమలు పోరాడలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు ఒగ్గు రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ బైకని కమలాకర్, నాయకులు భూమయ్య, భాస్కర్‌రెడ్డి, రాజు, భద్రయ్య, జహులామద్దీన్, కనకయ్య, మల్లయ్య, బాల్‌రాజు పాల్గొన్నారు.

సిద్దిపేటఎడ్యుకేషన్: తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాత్ర అనిర్వచనీయమని బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య (బీడీఎస్ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చందు, రాజేందర్, వెంకటేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



దుబ్బాకలో..



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో..



తొగుట(దుబ్బాక): గుడికందులలో..

ఉచిత వైద్య శిబిరం

మిరుదొడ్డి(దుబ్బాక): మల్లారెడ్డి, నారాయణ హైదరాబాద్ హాస్పిటల్స్ సౌజన్యంతో అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని మోతెలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 260 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మమత, నాయకులు రవి, రాజేశ్వర్, మురళి, వైద్య సిబ్బంది డా.సుల్తానా, జ్యోత్స్న, కిరణ్, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా అదే గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గౌడుగు మల్లేశం కుటుంబ సభ్యులకు రైతు బీమా క్లెయిమ్ పత్రాలను ఏఈఓ సమ్రీన్‌తో కలిసి సర్పంచ్ శ్రీనివాస్ అందజేశారు.

మత సామరస్యాన్ని కాపాడాలి

గజ్వేల్‌రూరల్: పట్టణంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొనడం విచారకరమని, ప్రజలు శాంతియుత వాతావరణానికి సహకరించి మత సామరస్యాన్ని కాపాడాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరాతో కలిసి ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మత సామరస్యానికి పెట్టింది పేరని, అన్ని కులాలను, మతాలను ప్రతి వ్యక్తి గౌరవించాలన్నారు. అసాంఘిక సంఘటనలు కలిగించే వ్యక్తులపై చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ప్రజలంతా సమన్వయంతో ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో అందరూ సమానమే అన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత



దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 80 మంది విద్యార్థులకు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు సిద్దిపేట స్వాతి బుక్ డిపో యజమాని చకిలం అశోక్ మంగళవారం స్కూల్ బ్యాగులు, ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌కు పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్రశేఖర్, తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మన బడితో పాఠశాలల అభివృద్ధి**

బెజ్జంకి(సిద్దిపేట): మన ఊరు–మన బడితో పాఠశాలల్లో మౌళిక వసతులు పెరిగి అభివృద్ధి చెందుతున్నాయని తోటపల్లి సర్పంచ్ బోయినిపెల్లి నర్సింగారావు పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లి ప్రభుత్వ పాఠశాల పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు ప్రభుత్వం ఇచ్చిన 25 వేల ప్రోత్సాహక డబ్బులతో కొనుగోలు చేసిన సీలింగ్ ఫ్యాన్‌లు, సౌండ్ సిస్టంలను పాఠశాలకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **దౌల్తాబాద్‌లో నేడు మండల సభ**

రాయపోలు(దుబ్బాక): ఈ నెల 5 బుధవారం దౌల్తాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ రాజేశ్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ గంగాధరి సంధ్య అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

◆ **నేడు మంత్రి హరీశ్‌రావు రాక**

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి మంత్రి హరీశ్‌రావు రానున్నట్లు ఆలయ చైర్మన్ గీస భిక్షపతి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆలయంలో రూ.12 కోట్లతో నిర్మించనున్న క్యూ కాంప్లెక్స్‌కు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డితో కలసి మంత్రి హరీశ్‌రావు భూమిపూజ చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, భక్తులు తరలిరావాలని కోరారు.

◆ **దుబ్బాక మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీధర్**

దుబ్బాక: దుబ్బాక మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన వడ్లకొండ శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మెడికల్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా జిందం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బింగి ప్రభాకర్, కోశాధికారిగా బాల ముకుందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ **రావూస్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని రావూస్ ప్రైమరీ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యానాథ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విద్యాశాఖ ఏడీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమర్షియల్ బ్లాక్‌లో పాఠశాలను నడిపిస్తూ రావూస్ పాఠశాల యాజమాన్యం విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తుందన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను పట్టించుకోకుండా రద్దీ ప్రాంతంలో పాఠశాలను నిర్వహించడం సరికాదన్నారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు ప్రణయ్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

దుబ్బాక: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌన్సిలర్ ఆస యాదగిరి అన్నారు. మంగళవారం సాయంత్రం 14 వార్డులో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతీ ఒక్కరు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మురుగు కాల్వల్లో, నీటి తొట్టెల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ పర్యవేక్షణ అధికారి దిలీప్‌కుమార్ తదితరులున్నారు.

◆ **నేడు డయల్ యువర్ డీఎం**

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్(జీపీపీ) ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉంటుందన్నారు. జీపీపీ డిపో పరిధిలోని బస్సులలో ప్రయాణించే వారు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా తమ దృష్టికి తీసుకొచ్చినట్లయితే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ **ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి**

సిద్దిపేటరూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవాపూర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, చందు, కనకరాజు, గణేశ్, కనకరాజు, వార్డుసభ్యులు దేవదాస్, కనకయ్య, ఎల్లంగౌడ్, మాజీ సర్పంచ్ సత్తాగౌడ్, నాయకులు యాదగిరి, సత్యం తదితరులు పాల్గొన్నారు.